


ఈకాలం
THE HONEST TELUGU DAILY




గురువారం 12-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :133 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల

# 16.9కోట్ల చేనేత రుణమాఫీ నిధులు విడుదలకై వినతి



**నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రంలో మిగిలిపోయిన చేనేత కార్మికుల రుణమాఫీ నిధులు 16.9 లక్షల కోట్ల రూపాయలు రేపే విడుదల చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు**

చేనేత సమస్యలైన రుణమాఫీ నేతన్న భరోసా నిధులు, ప్రభుత్వ వాటా నిధులను విడుదల చేయాలని వ్యవసాయ చేనేత శాఖామాత్యులు తుమ్మలను అఖిల భారత పద్మశాలి సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మరపు మురళి మరియు అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్ల ఆధ్వర్యంలో సెక్రటేరియట్లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కరీంనగర్ డంపింగ్ యార్డు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన చెత్త కుప్పలు - త్వరలో తరలింపు ప్రక్రియ ప్రారంభం

కరీంనగర్ పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న డంపింగ్ యార్డును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. ఇటీవల చొప్పదండి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కరీంనగర్ ప్రజలకు హామీ ఇస్తూ డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.



# దేశాన్ని 'ఆత్మనిర్భర్'గా మార్చడానికి అవిశ్రాంత బీజేపీ-ఎన్డీఏ కృషి

- అక్కడి ఘటనపై కాంగ్రెస్ నేతలు రీల్స్ చేస్తారన్న ప్రధాని కొచ్చి రిఫైనరీలో 5 వేల 500 కోట్లతో నిర్మించే పాలీప్రొఫైలిన్ యూనిట్కు శంకుస్థాపన
- దేశాన్ని విదేశాలపై ఎక్కువగా ఆధారపడేలా చేసి ఆనందించారు దేశంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి తెలియదని విమర్శలు
- కేరళలో పర్యటిస్తోన్న ప్రధాని మోడీ కాలుష్యాన్ని నియంత్రించాలి



# గ్యాస్ సిలిండర్లకు ఇబ్బందిలేదు

దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ల కొరతపై నెలకొన్న మోడీ సర్కార్ ఆందోళనలకు మోదీ సర్కార్ తెరదించింది. వినియోగదారులకు కీలక ప్రకటన ఊరటనిచ్చేలా కీలక ప్రకటన విడుదల చేసింది కేంద్ర ప్రభుత్వం. గ్యాస్ బుక్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.




# మానవత్వంతో వెలుగుమట్ల పేదలకు న్యాయం

- కొన్ని ముఠాలు మోసం చేశాయి: మంత్రి తుమ్మల
- పదేళ్లు అధికారంలో ఉండి కూడా..: మంత్రి పొంగులేటి
- "పేదల నిస్సహాయతను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయాలు చేశారు.
- అమాయకులను మోసం చేసి రూ.లక్షల్లో వసూలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేదు ఇక్కడి పేదలను కొందరు మోసం చేస్తున్నారని కోర్టు చెప్పింది.




కాంగ్రెస్ సర్కారు పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ ఇల్లు ఉండాలనేది తమ ఆశయం అన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇళ్లు మంజూరు చేయడంతో పాటు.. నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. "వెలుగుమట్ల భూముల విషయంలో కొందరు మొసలి కన్నీరు కార్చారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? పేదల పట్ల జాలి ఉంటే వారికి సాయం ఎందుకు చేయలేదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కొందరు పగటి కలలు కంటున్నారు. పేదల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా ప్రభుత్వం మాది. వెలుగుమట్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తాం. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే సదుపాయాలు పూర్తి చేస్తాం" అని పొంగులేటి అన్నారు

# పార్టీ ఫిరాయింపులకు ప్రయోగశాలగా తెలంగాణ




ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ పేరుతో కాలం వెళ్లబుచ్చి.. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా క్లీన్‌చిట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. తెలంగాణను పార్టీ ఫిరాయింపులకు ఒక ప్రయోగశాలగా తయారు చేశారన్నారు. స్వయంగా కండువాలు కప్పిన సీఎం ఇప్పుడు నోరు మెదపకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు."నైతిక విలువలకు, ప్రజా తీర్పునకు గౌరవం ఇచ్చే పార్టీ భాజపా. ఒక్క సీటుతో ప్రభుత్వాన్ని కోల్పోతామని తెలిసి కూడా ఫిరాయింపులను అప్పటి ప్రధాని వాజ్‌పేయీ ప్రోత్సహించలేదు. ఎప్పుడూ రాజ్యాంగాన్ని కాపాడాలని చెప్పే రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చర్యకు జవాబు చెప్పాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన స్పీకర్.. మచ్చ తెచ్చేలా వ్యవహరించారు. తెలంగాణలో అంబేడ్కర్ రాజ్యాంగం కాదు.. రేవంత్‌రెడ్డి రాజ్యాంగం అమలవుతోంది. పార్లమెంటులో రాహుల్ గాంధీ నీతులు చెప్తారు,

# గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు.. జాగ్రత్త!

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామని, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని, వీటిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. వాట్సప్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింక్‌లను పంపిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

# నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుంది

- ఇరాన్‌పై యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్



ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని, ఇంకేమీ మిగల్లేదని అన్నారు. ఓ వార్తా సంస్థకు టెలిఫోన్ ఇంటర్వ్యూ ఇచ్చిన అధ్యక్షుడు ట్రంప్.. తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ముగుస్తుందన్నారు. "ఇరాన్‌లో భీకర యుద్ధం కొనసాగుతోంది. ఒకటి, రెండు మినహా.. అక్కడ పెద్దగా లక్ష్యాలేమి మిగల్లేదు. అమెరికా సేనలు ఊహించిన దానికన్నా ఎక్కువ విధ్వంసం సృష్టించాయి. మా ప్రణాళిక కన్నా చాలా ముందున్నాం. ఆరు వారాల్లో సృష్టిస్తామనుకున్న విధ్వంసాన్ని ముందుగానే చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు

# సంపాదకీయం

## విదేశాంగ నీతిలో తప్పటడుగులు..

మేము నిటారుగా నిల్చుంటాం. ఎవరిముందూ తలవంచం. మా మిత్రులందరికీ స్నేహహస్తం అందుబాటులో ఉంటుంది. మా వ్యవహారాల్లో ఎవరి జోక్యాన్ని సహించం'. 1982లో నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్య ఇది. భారత్‌ను అమెరికా శిబిరంలో చేరాలని ప్రెసిడెంట్ రీగన్ చేసిన ప్రతిపాదనకు ఇందిర నిష్కర్షగా చెప్పిన సమాధానం అది. ఆమె ఈ మాటల్ని ఎక్కడో అనలేదు. తన అమెరికా పర్యటనలో, సాక్షాత్తు రోనాల్డ్ రీగన్ సమక్షంలోనే అమెరికా, రష్యాల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో-- తాము ఎవరి పక్షమూ వహించబోమని, దౌత్యపరంగా తమది తటస్థ వైఖరి అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు ఇందిర.దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని, అటల్ బిహారీ వాజపేయి వరకు, మధ్యలో దేశ ప్రధానులుగా కాంగ్రెస్ పార్టీ వారున్నా, కాంగ్రెసేతర పార్టీలకు చెందిన వారెవరున్నా.. భారతదేశ విదేశాంగ విధానం సుదృఢంగా అలీన విధానం (నాన్ అలైన్డ్) గానే కొనసాగింది. నిజానికి ఆనాటి భారత్ నేటి మాదిరిగానే ప్రబల ఆర్థికశక్తిగా లేదు. పేదరికం, అవిద్య, నిరుద్యోగం వంటి ఎన్నో సామాజిక, ఆర్థిక రుగ్మతలతో దేశం సతమతమవుతోంది. అయినప్పటికీ అన్న వస్త్రాల కోసమో, అణ్వాయుధాల కోసమో భారత్ ఎవరిముందూ తలవంచలేదు. దేశాన్ని ఎవరు ఏలుతున్నా.. వారు ఏకపక్షంగా తమకు తోచినట్టుగా నిర్ణయాలు తీసుకోలేదు. సొంత పార్టీ నేతలను, దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలను కలుపుకుని అందరి సలహాలు, సూచనల మేరకు విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దారు. ప్రధానంగా దేశ ప్రయోజనాలు, మరీ ముఖ్యంగా ప్రపంచ మానవాళి శాంతి సౌభాగ్యాలకు దోహదం చేసే విదేశాంగ విధానాన్ని అనుసరించారు. కొన్ని సందర్భాలలో విదేశాంగనీతిలో రాజీపడవలసిన అనివార్యత ఏర్పడినా.. దేశ ప్రయోజనాల్ని ఎవరూ ఎన్నడూ పణంగా పెట్టలేదు. ఫలితంగానే నిన్నమొన్నటి వరకూ.. 'భారత' కీర్తి ప్రతిష్ఠల్ని అంతర్జాతీయంగా సమున్నత స్థాయికి తీసుకువెళ్లగలిగారు.
అయితే, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నడుస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న ఏకపక్ష విదేశాంగ విధానంతో అంతర్జాతీయంగా మన దేశ ప్రతిష్ఠ మసకబారింది. దేశ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. భారతదేశం అనుసరించే విదేశాంగ విధానాన్ని ఒకప్పుడు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి (స్ట్రాటజిక్ అటానమీ)గా చెప్పుకొనేవారు. దానివల్లనే దక్షిణాసియా దేశాలకు భారత్ ప్రాంతీయ నాయకత్వం వహించే స్థితికి చేరింది. కానీ, నేడు భారత విదేశాంగ విధానంలో స్పష్టత లోపించింది. ప్రత్యర్థి దేశాలకంటే వెనుకబడిపోయింది. అంతర్జాతీయంగా అనేక అవకాశాలు కోల్పోయింది. చివరకు-- నేడు భారత్ ఎవరిపక్షం ఎందుకు వహిస్తున్నదో, దానివల్ల సాధిస్తున్న ప్రయోజనాలేమిటో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.
'ఎలాంటి స్నేహితులు ఉండాలో ఎంచుకొనే అవకాశం మీకు ఉంది. కానీ పొరుగున ఎవరు ఉండాలో నిర్ణయించడం మీ చేతుల్లో ఉండదు' అనేవారు అటల్‌బిహారీ వాజపేయి. ఆ కారణంగానే ఒక్క పాకిస్థాన్ మినహా మిగతా పొరుగు దేశాలతో వాణిజ్య, దౌత్య, సాంస్కృతికపరంగా చక్కటి సంబంధాలు నెలకొల్పడానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. భారత్ తనకు మించిన స్థాయిలో నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, మాల్దీవులకు అన్ని రకాలుగా సాయం చేసింది. అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లను దాదాపుగా ఒంటిచేత్తో పునర్నిర్మాణం చేసింది. అఫ్ఘానిస్థాన్ పార్లమెంట్ భవనం నిర్మాణం మొదలుకొని రోడ్లు, బ్రిడ్జిలు, టెలిఫోన్ వ్యవస్థ వరకు అనేక రంగాలలో సాయం చేసింది. 1971--72లో తూర్పు పాకిస్థాన్ విముక్తమై బంగ్లాదేశ్‌గా అవతరించడానికి పాకిస్థాన్‌తో యుద్ధమే చేసిన భారత్.. ఆనాడు బంగ్లాదేశ్ శరణార్థులకు చోటిచ్చింది. వారి ఆకలి దప్పులు తీర్చడానికి దేశ ప్రజలపై అదనపు పన్నులు వేసింది. శ్రీలంకలో వేర్పాటువాదాన్ని అణచడానికి భారత్ తన సైన్యాన్నే (ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్-- ఐపీకేఎఫ్) పంపింది. పొరుగు దేశాలైన మయన్మార్, మాల్దీవులకు సైతం సాయపడింది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా.. ఇదొక నిరంతర ప్రక్రియలా కొనసాగింది.నేడు 'నైబర్ హుడ్ ఫస్ట్' కాస్తా.. 'నైబర్ హుడ్ ఫర్‌గెట్'గా మారింది. భారత్‌ను ద్వేషించే దేశాలలో పాకిస్థాన్ సరసన బంగ్లాదేశ్ చేరిపోయింది. బంగ్లాదేశ్ పూర్తిగా చైనా చెప్పుచేతల్లోకి వెళ్లిపోయింది. హసీనా ప్రభుత్వ పతనం అనంతరం బంగ్లాదేశ్‌లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. మోంగ్లా ఓడరేవును, తీస్థా నదీ ముఖద్వారాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. నేపాల్, శ్రీలంక, మాల్దీవులతో సైతం భారత్ సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఏదో సామెత చెప్పినట్లు.. సొమ్మొ పోయి, శని పట్టడానికి కారణం-- మన దౌత్యనీతిలో వచ్చిన మార్పే! పొరుగు దేశాలతో పరస్పర సహకారం, గౌరవం ఇచ్చిపుచ్చుకుంటూ స్వప్రయోజనాలను కాపాడుకోవలసిన దౌత్య విధానంలో రాజకీయాలు జొరబడడం వల్ల.. సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. బంగ్లాదేశ్‌లో అవామీలీగ్ నేత షేక్ హసీనాతో అనుబంధం పెంచుకోవడం వల్ల అమెను వ్యతిరేకించే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైనాకు దగ్గరయింది. అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అధినేత తారిక్ రెహ్మాన్ చైనాకు తమ దేశపు తలుపులు బార్లా తెరిచాడు. అమెరికా విషయంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ ఈ విధంగానే వ్యవహరించారు. ట్రంప్‌ను గెలిపించాలని ఆ దేశం వెళ్లి ఇండియన్ డయాస్పోరాకు పిలుపునిచ్చారు. పోనీ ట్రంప్ ఆ మేరకు నరేంద్రమోదీ పట్ల, భారత్ పట్ల కృతజ్ఞత చూపించాడా అంటే అదీలేదు. భారత్‌పై ఏకపక్షంగా టారిఫ్‌లు భారీగా విధించాడు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుపై ఆంక్షలు విధించాడు. ఇరాన్ నుంచి కూడా చమురు దిగుమతి చేసుకోరాదని అంతకుముందే హెచ్చరించాడు. పైగా, అమెరికా ఆంక్షలకు తలొగ్గిన ఫలితంగా.. భారత మార్కెట్లను అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు ముంచెత్తబోతున్నాయి. దాంతో, భారత రైతాంగం పరిస్థితి ప్రశ్నార్థకం కావడం ఖాయం.ఇటీవల విశాఖలో జరిగిన నేవీ ఫీట్‌లో పాల్గొని స్వదేశానికి బయలుదేరిన ఇరాన్ ఓడను హిందూ మహాసముద్రంలో అమెరికా అత్యంత అమానుషంగా ముంచేసిన ఘటనపై భారత్ నోరు మెదపలేదు. తమ అతిథిని ఆ విధంగా చేయడమేమిటని అమెరికాను ప్రశ్నించలేదు. హిందూ మహాసముద్రంలో దొంగచాటుగా అమెరికా తన జలాంతర్గాములను మోహరిస్తే దానిని తప్పని ఖండించలేదు. ఇక, ఇరాన్ అధినేత ఖొమేనీ హత్య జరిగిన ఆరు రోజుల అనంతరం భారత్ దౌత్యాధికారి ఒకరు ఢిల్లీలోని ఇరాన్ కాన్సులేట్‌కు వెళ్లి మొక్కుబడి సంతాపం తెలిపి వచ్చారు. ఈ దాడి ఘటనపై మన దేశాధినేత నోరు మెదపకపోవడం ఆశ్చర్యం. ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉండి ఉంటే.. ఈ పాటికే వాటిని ప్రయోగించి ఉండేది. ఆయా దేశాలను నాశనం చేయడానికి అమెరికా బూచీగా చూపించే అంశం-- అణ్వాయుధాలు కలిగి ఉండడం. దీనిని కూడా ఇండియా ప్రశ్నించలేకపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా.. ఇరాన్‌తో యుద్ధానికి సిద్ధపడిన ఇజ్రాయెల్ దేశంలో, మన ప్రధాని నరేంద్రమోదీ పర్యటించడమే ఆశ్చర్యం. ఇజ్రాయెల్‌ను పర్యటించిన ఏకైక భారత ప్రధాని ఇప్పటివరకు ఒక్క మోదీయే. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. హమాస్‌తో ఇజ్రాయెల్ జరిపిన యుద్ధంలో చనిపోయిన 1,219 ఇజ్రాయెలీలకు సంతాపం వ్యక్తం చేశారేతప్ప, ఇప్పటివరకు అసువులు బాసిన 70 వేల మంది పాలస్థీనీయుల పట్ల చుక్క కన్నీరు కూడా కార్చలేకపోయారు.

# పార్టీ ఫిరాయింపులను స్పీకర్ ప్రోత్సహిస్తారా

తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అగౌరవం ఎదురవుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి పార్టీ ఫిరాయింపుదారులకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ 'క్లీన్ చిట్' ఇవ్వడం తెలంగాణ ప్రజల తీర్పును కాలరాయడమే. ఈ విషయంలో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరునే బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ రెండు పార్టీల ఆలోచన శైలి, వ్యవహార శైలిలో ఏమార్పూ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, తర్వాత ముఖ్యమంత్రి సమక్షంలో కండువా మార్చుకుని, ఏకంగా కాంగ్రెస్ బీ-ఫామ్ మీద ఎంపీగా నా మీద పోటీ చేసిన సాక్ష్యాలు సరిపోవా స్పీకర్ అని ప్రశ్నించారు. సామాన్యులందరికీ కనిపించిన సాక్ష్యాలు మీకు ఎందుకు కనిపించడం లేదు? ఫిరాయింపులను అరికట్టాల్సిన అత్యున్నతమైన, బాధ్యతాయుతమైన స్పీకర్ పదవిలో ఉండి, వాటికి చట్టబద్ధత కల్పించడం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం. రక్షించాల్సిన వారే భక్షకులుగా మారి రాజ్యాంగ వ్యవస్థలను అధికార పార్టీ చేతిలో బందీగా మార్చారన్నారు. ఇది ప్రజల తీర్పును కాంగ్రెస్ పార్టీ అపహాస్యం చేసిన తీరుకు నిదర్శనం. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పదవుల కోసం ప్రజా తీర్పును అంగట్లో సరకులాగా మారిస్తే దానికి స్పీకర్ గారు వత్తాసు పలకడం దురదృష్టకరం అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గుర్తుమీద ఎన్నికైన శాసనసభ్యులు బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేస్తారు. పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లుపొడిచి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి పార్టీ ఫిరాయించడం కారు గుర్తుపై గుర్తుపై ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధి కాంగ్రెస్ గుర్తుపై పోటీచేశారు. ఈ రెండు పార్టీలు తెలంగాణలో పార్టీఫిరాయింపుల చట్టాన్ని కాలరాయడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడంలో ఒకరికొకరు పోటీపడి ప్రజాతీర్పునకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. అధికార దుర్వినియోగంతో వ్యవస్థలను మేనేజ్ చేయవచ్చు కానీ, ప్రజల ఆగ్రహాన్ని మేనేజ్ చేయలేరు. కళ్లముందు జరుగుతున్న ఈ అన్యాయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోంది. రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న వారికి ప్రజా క్షేత్రంలో తగిన శాస్తి తప్పదన్నారు.

# సీఎం బంధువులు సహజ వనరుల దోపిడీ

హైదరాబాద్ సమీపంలోని హిమాయత్సాగర్ పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్, క్రషింగ్ కార్యకలాపాల గుట్టు రట్టు చేయడానికి బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్ ఈరోజు ఉదయం కొకాపేట్ సమీపంలోని నియోపోలిస్ ప్రాంతంలో ఉన్న భాగ్యలక్ష్మి మినరల్స్ క్రషింగ్ యూనిట్ను సందర్శించి పరిశీలించింది. ఈ క్రషింగ్ యూనిట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనల్లుడు రమేష్ రెడ్డి అనుచరులకు సంబంధించినదిగా ఆరోపణలు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు అక్కడ జరుగుతున్న పలు అక్రమాలను బయటపెట్టారు. ఈ ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, ఎస్సీ/ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిషోర్ గౌడ్, టీఎస్ఎండీసీ మాజీ చైర్మన్ డా. మన్నె క్రిషాంక్, తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు మాజీ సభ్యుడు ఎస్. రాఘవేందర్, ఫైనాన్స్ కమిషన్ మాజీ సభ్యుడు జి. శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు అభిలాష్ రంగినేని సభ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన బినామీల పేరుతో నడుస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్స్ క్రషింగ్ యూనిట్ను పరిశీలించి అక్కడ జరుగుతున్న అక్రమాలను బయటపెట్టామని గుర్తు చేశారు. అక్కడ కనిపించిన దృశ్యాలు 'కేజీఎఫ్' సినిమాను తలపించాయని, ఇప్పుడు నియోపోలిస్ ప్రాంతంలో కనిపిస్తున్న దృశ్యాలు దానికంటే ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. భాగ్యలక్ష్మి మినరల్స్ క్రషింగ్ యూనిట్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తప్ప ఇతర శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపించారు. అయినప్పటికీ ఈ యూనిట్లో భారీ స్థాయిలో క్రషింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. నెలకు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తోందని, ఆ మొత్తం ముఖ్యమంత్రి బంధువుల జేబుల్లోకి వెళ్తొందని విమర్శించారు. జీవో 111పరిధిలో సాధారణ ప్రజలు చిన్న ఇల్లు కూడా నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వని అధికారులు, అదే ప్రాంతంలో 17 ఎకరాల్లో భారీగా క్రషింగ్ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం పాలకులతో కుమ్మక్కైందా అని నిలదీశారు. మూడు ఆధునిక క్రషర్లతో గుట్టలను కొల్లగొడుతూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పర్యావరణ విధ్వంసం జరుగుతున్నా జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి (పి సి బి), మైనింగ్ శాఖలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పదిహేడు ఎకరాల భూమిని నామినేషన్ పద్ధతిలో ఎలా కేటాయించారని, ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఈ క్రషింగ్ యూనిట్ నుంచి తీసిన కంకరనే చుట్టుపక్కల నిర్మాణాలకు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఫత్వా జారీ చేశారనే సమాచారం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను ఏటీఎంలా ఉపయోగించుకుంటూ ఢిల్లీకి కప్పం కడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం స్పందించకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని, అవసరమైతే గ్రీన్ ట్రిబ్యునలు కూడా సంప్రదిస్తామని స్పష్టం చేశారు.

# యుద్ధం అక్కడ... కష్టాలు ఇక్కడ

ప్రస్తుతం సామాన్యుడి వంటగదిలో గ్యాస్ మంట పుట్టిస్తోంది. గత కొద్ది రోజులుగా గ్యాస్ సిలిండర్ బుక్ చేసినా సకాలంలో రాకపోవడం, మరోవైపు ధరలు అమాంతం పెరగడం చూస్తుంటే వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. అసలు ఆంధ్రప్రదేశ్లో గ్యాస్ కొరత నిజంగా ఉందా? లేక ఇది కృత్రిమంగా సృష్టించిన మాయాజాలమా? దీనికి అంతర్జాతీయ యుద్ధ మేఘాలకు ఉన్న సంబంధం ఏంటి? ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం మన వంటగదిపై నేరుగా ప్రభావం చూపుతోంది. దీనికి ప్రధాన కారణం 'హోర్ముజ్ జలసంధి' భారతదేశం తనకి కావాల్సిన ఎల్పీజీలో దాదాపు 60 శాతానికి పైగా గల్ఫ్ దేశాల నుండే దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం కారణంగా ఈ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలకు అంతరాయం కలగడం, బీమా ధరలు పెరగడం వల్ల గ్యాస్ సరఫరా గొలుసు దెబ్బతిన్నది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడంతో పాటు ఎల్పీజీ లభ్యత తగ్గింది. ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. ముఖ్యంగా గృహ వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు ఉండేందుకు కొన్ని కీలక మార్పులు చేశాయి. 25 రోజుల గ్యాప్ నిబంధన: గ్యాస్ సిలిండర్లను ప్రజలు ముందే స్టాక్ పెట్టుకోకుండా ఉండేందుకు, ఒక బుకింగ్కు మరియు తదుపరి బుకింగ్కు మధ్య కనీసం 25 రోజుల సమయం ఉండాలని నిబంధన విధించారు. డొమెస్టిక్ గ్యాస్కే ప్రాధాన్యత: రిఫైనరీల నుండి వచ్చే గ్యాస్ను హోటళ్లు, ఇతర వ్యాపార అవసరాలకు కాకుండా, కేవలం ఇళ్లకే సరఫరా చేయాలని ఆదేశించారు. దీనివల్ల కమర్షియల్ గ్యాస్ ధరలు దాదాపు 144 రూపాయల వరకు పెరగగా, గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో కొంత జాప్యం జరుగుతోంది. ఏపీలో పరిస్థితి ఏంటి? ఆంధ్రప్రదేశ్లో గ్యాస్ కొరత లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.విశాఖపట్నం హెచ్పీసీఎల్ రిఫైనరీ మరియు మంగళూరు పైప్ లైన్ ద్వారా రాష్ట్రానికి నిరంతర సరఫరా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. అయితే, బుకింగ్ చేసినా వారం రోజుల వరకు సిలిండర్లు రాకపోవడానికి కారణం క్షేత్రస్థాయిలో ఉన్న రవాణా సమస్యలు మరియు పెరిగిన డిమాండ్ అని తెలుస్తోంది.కొరత ఉందనే సాకుతో కొన్ని చోట్ల బ్లాక్ మార్కెట్ దందా కూడా మొదలైనట్లు సమాచారం. గ్యాస్ ఏజెన్సీలు లేదా డెలివరీ బాయ్స్ ద్వారా కృత్రిమ కొరతను సృష్టించి, ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలో విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. అక్రమాలకు పాల్పడితే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వినియోగదారులు ఏం చేయాలి? ప్రస్తుతానికి గ్యాస్ సరఫరాలో కొంత ఆలస్యం జరగడం వాస్తవమే అయినా, అది తాత్కాలికమేనని నిపుణులు చెబుతున్నారు.ప్రజలు ఆందోళన చెంది అధికంగా బుక్ చేయవద్దని, ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని కోరుతున్నారు.గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత ఏజెన్సీకి లేదా టోల్ ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయడం ఉత్తమం. యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరాలో ఆటంకాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం స్థానిక ఉత్పత్తులను పెంచి సర్దుబాటు చేస్తోంది. కాబట్టి వినియోగదారులు వదంతులను నమ్మకుండా ఓపిక పట్టాల్సిన సమయం ఇది.

# ఆ సంస్కృతి మీరే మొదలు పెట్టారు

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.తెలంగాణలో రాజకీయ ఫిరాయింపులకు బీజం వేసింది కేసీఆర్ కాదా? గతంలో ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకోవడమే కాకుండా, ఏకంగా మంత్రులను చేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై విమ్మలు చేసే ముందు బీఆర్ఎస్ గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మొదలు పెట్టింది కేసీఆర్.జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినవి కావు.ఎక్కడో ఉన్న రాహుల్ గాంధీ ముచ్చట మీకెందుకు. ఒకప్పుడు ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకొని ఏకంగా మంత్రులను చేసిన సంస్కృతి మీది మీ నాయకత్వం నచ్చకనే 10 మంది బయటికి వచ్చారు.కడియంతో పాటు పది మంది ఎమ్మెల్యేలను ప్రాధేయపడి మీ పార్టీలోకి ఆహ్వానించు. హరీష్ రావు, కేటీఆర్ మధ్య అంతర్గత గొడవ వల్ల పార్టీలో ఉండలేక పోతున్నామని మీ పార్టీ నేతలు చెబుతున్నారు. మీ పార్టీపై ఎవరికీ నమ్మకం లేదు..బయటికి వెళ్లిన వాళ్లను మళ్లీ మీ పార్టీలో తెచ్చుకోగలరా? గతంలో కాంగ్రెస్ శాసన సభ పక్షాన్ని బీఆర్ఎస్లో విలీనం చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నావు. ఇప్పుడు నువు మాట్లాడే వాళ్ళు కాంగ్రెస్, తెలుగుదేశం నుండి నీ పార్టీలోకి వచ్చిన వాళ్ళు కాదా..! ప్రజలకి ఇబ్బంది ఐతే స్పందించే గుణం ప్రతిపక్షాలకి ఉండాలి..! అబద్ధపు రాజకీయ ప్రచారాలు కాదు' అని అన్నారు.



# “యువత” ముందడుగు అభినందనీయం!

**ఈకాలం, ఆదిలాబాద్**

సాత్నాల మండలంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలకు పర్వతగిరి భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికై రూ.11,000 నగదును గ్రామ సర్పంచ్ పెందుర్ ఇస్తారి సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్ కుమార్ యాదవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా శరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పర్వతగిరి భీమ్ యూత్ సభ్యులు పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. యూత్ సభ్యులు ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. యువత బాగా చదువుకోని ఉన్నతంగా ఎదిగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గ్రామ, పాఠశాల అభివృద్ధిలో యువత పాత్ర పునాదిలాంటిదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెందుర్ ఇస్తారి, యూత్ ప్రసిడెంట్ మడవి




రాజు, వైస్ ప్రసిడెంట్ కుర్సేంగ విజయ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కుమ్ర సంతోష్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు ఎస్పీ కృషి





**ఈకాలం, ఆదిలాబాద్**

జిల్లలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ అఖిల్ మహాజన్ విశేష కృషి చేస్తున్నారని సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛలతో సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఇటీవల పొలిసు శాఖ



ఆధ్వర్యంలో మెగా జాబ్ మేలా నిర్వహించి... నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి రేణుకుంట రవీందర్, సభ్యులు సామన్పల్లి నర్సింలు, మామిడి రాజ్ కుమార్, కందుల రవీందర్, ఉరడే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ విశ్వాసం.. పట్టుదలతో సాధించాలి

**- విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయబాబు**

**ఈకాలం, ఆదిలాబాద్**

విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సులు ఎంచుకొని ఆత్మ విశ్వాసం.. పట్టుదలతో దేనినైనా సాధించవచ్చని విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ సల్ల విజయబాబు అన్నారు. కప్పర్ల ఉన్నత పాఠశాలలో 10వ తరగతు విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ పై సలహాలు.. సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్, ఇంజనీర్, తహశీల్దార్, పోలీస్, నర్స్ వంటి అనేక ఉద్యోగాలున్నాయని, తమకు ఇష్టమైన




వాటిని ఎంపిక చేసుకొని చదవాలని సూచించారు. తదుపరి జరిగిన కార్యక్రమంలో గంద్రత్ అరుణ్, సర్పంచ్ పాల్గొని విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందచేశారు. మరో అతిథిగా పాల్గొన్న జీవన్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ పరీక్షలు ఎలా రాయాలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు



ఆనంద్, ఉపాధ్యాయులు సంతోష్, శ్రీనివాస్, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఉపాధి కూలీల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి**

**- ఉపాధి నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలు ఆపాలి**

**- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**- జిల్లా ఏపీడికి సిపిఎం ప్రతినిధి బృందం వినతి**

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఐఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించాలని డిఆర్డిఏ ఏపీడి గారికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు మాట్లాడుతూ రికార్డు చేయగానే డొక్కాడనటువంటి కూలీలకు పనిచేసిన 8 వారాలు కూలీ డబ్బులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఉపాధి హామీ చట్టం 15 రోజుల్లో కచ్చితంగా కూలీ డబ్బులు ఇవ్వాలని చెబుతున్న పాలకులు మూడు నెలలైనా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. గ్రామాలలో రైతాంగానికి ఉపయోగపడేటువంటి పద్ధతుల్లో కూలీలు పనిచేస్తున్నారని గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తున్న కూలీలకు ప్రతివారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో వేతనాలు చెల్లించకుంటే సంబంధిత అధికారుల జీతాల నుంచి కోతవిధించి కూలీలకు ఇవ్వాల్సి ఉంటుందని కూడా చట్టం చెబుతుందని అధికారుల చొరవ ఎక్కువగా ఉండాలని అన్నారు. మండుటెండలో పనిచేస్తున్నటువంటి కూలీలకు టెంట్ సౌకర్యం మంచినీళ్లు వెంటనే ఇవ్వాలని పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే ఐడెం కాటన్ లాంటిది మెడికల్ కిట్టు ద్వారా అందించాల్సింది పోయి ఎక్కడ ఇవ్వడం లేదని వీటన్నింటిని వెంటనే పని ప్రదేశంలో సమకూర్చాలని అన్నారు. ఉపాధి హామీ



కూలీలకు నోటికాడి ముద్దను లాక్కునే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువచ్చి అనేక ఇబ్బందులు పెడుతుందని అన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం రద్దు చేసి ఐరిస్ ఫోటోలను తీసివేయాలని డిమాండ్ చేశారు. కొలతలు పద్ధతిలో పనిచేస్తున్నప్పటికీ మళ్లీ ఫోటోలు తీయడం అనేది కూలీల యొక్క సమయపాలనను వృధా చేయడమేనని అన్నారు. కూలీల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సిములు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రి భాయి పూలే వర్ధంతి.

**- నివాళు లర్పించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం.**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం లోని సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి వర్ధంతిని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వై. నరోత్తం మాట్లాడుతూ ఆడబిడ్డల చదువుకోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన గొప్ప చైతన్య మూర్తి,సామాజిక ఉద్యమకారిణి సావిత్రి భాయి పూలే గారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మనమందరం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు స్వామి దాస్, రాచన్న, శివ కుమార్, యస్.గోపాల్, జి.మల్లేశం,భూమ్ రెడ్డి,యస్.వెంకట్,చెంగల్ జైపాల్,సంగన్న, యం. జైపాల్, శ్రీనివాస్, మేఘనాథ్,లాజర్, తదితరులు పాల్గొన్నారు.

# 24. 4వేలు పలికిన నర్సింహులపేట అంగడి వేలం



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే సంత బహిరంగ వేలం పాటను బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ పెదమాముల యాకయ్య ఎంపీఓ కిన్నెర యాకయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ల సమక్షంలో నిర్వహించారు. అంగడి నిర్వహణను ఏడాది పాటు దక్కించుకోవడం కోసం పలు ప్రాంతాలకు చెందిన 35 మంది గుత్తేదారులు బహిరంగ వేలం పాటలో పోటీపడ్డారు. చివరకు నర్సంపేట కి చెందిన పాలకుర్తి ప్రభాకర్ సొంతం చేసుకున్నారు. అంగడి నిర్వహణను రూ.24.4 లక్షలకు బహిరంగ వేలం పాటలో దక్కించుకున్నారు.

# సిద్ధపూర్‌లో ఘనంగా మహిళా శక్తి భవన భూమి పూజ



ఝరాసంగం మండల పరిధిలోని సిద్ధపూర్ గ్రామంలో నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ‘మహిళా శక్తి భవనం’ నిర్మాణానికి మరియు నూతన బోరు బావి ఏర్పాటుకు అత్యంత వైభవంగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ విచ్చేసి, పూజా కార్యక్రమాల్లో పాల్గొని పనులను ప్రారంభించారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు అభినందనీయమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే గ్రామస్తుల నీటి అవసరాలను తీర్చేందుకు నూతన బోరు బావి ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హఫీజ్ , సిద్ధపూర్ గ్రామ సర్పంచ్ , వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో ముప్పాళ్ళమ్మ తల్లి అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవం

**కూటమి నేతలతో కలిసి హాజరైన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**గ్రామాభివృద్ధి పాడిపంటల సుభిక్షం కోసం దేవతల ప్రార్థన**



చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో ముప్పాళ్ళమ్మ తల్లి మరియు అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు గ్రామ ప్రజలతో కలిసి తిరుణాల కార్యక్రమాల్లో పాల్గొని వారి ఆనందాన్ని పంచుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ గ్రామాల్లో పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు గ్రామ ప్రజల ఐక్యత సంప్రదాయాలను కాపాడుతూ ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగడం ఆనందకరమని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పేద విద్యార్థులకు 'జయన్న ఫౌండేషన్' ఆర్థిక భరోసా

**- పదో తరగతి విద్యార్థులకు నగదు, పరీక్షా సామాగ్రి పంపిణీ**
**- వచ్చే ఏడాది నుంచి ఉచిత బ్యాగులు, శానిటరీ ప్యాడ్లు:ఫౌండేషన్ చైర్మన్ సరిత జైపాల్ రెడ్డి ప్రకటన**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు హుజురాబాద్ మండలం సింగాపూర్‌కు చెందిన 'జయన్న ఫౌండేషన్' మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో రవాణా, అల్పాహార ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయంతో పాటు అవసరమైన పరీక్షా సామాగ్రిని బుధవారం హుజురాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు.ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుడిపాటి సరిత జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (వీజూా) విడపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల చదువును తక్కువ అంచనా వేయవద్దని, నేడు దేశంలో అత్యున్నత పదవుల్లో ఉన్న ఎందరో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ బడుల్లో చదువుకున్నవారేనని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను వివరిస్తూ.. విద్య సమాజాన్ని ప్రశ్నించే శక్తిని ఇస్తుందని తెలిపారు.దముఖ్యంగా పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు వరంగల్ నుండి మానసిక వైద్య నిపుణులను రప్పించి విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇప్పించారు. ఒత్తిడిని జయించి పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో నిపుణులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రూ. 700 నగదు మరియు ఎగ్జామ్ కిట్లు హుజురాబాద్ మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు, పరీక్షల సమయంలో ఒక్కొక్కరికి 700 రూపాయల నగదును గిఫ్ట్‌గా అందజేశారు. దీనితో పాటు:ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు.హాల్ టికెట్లు భద్రంగా ఉంచుకోవడానికి ప్రత్యేక కవర్లతో కూడిన కిట్లు. "చిన్నతనంలో ప్యాడ్ లేక పక్క విద్యార్థిని అడిగి పరీక్ష రాసిన కష్టాన్ని నేను అనుభవించాను. ప్రస్తుత విద్యార్థులకు అటువంటి పరిస్థితి రాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని సరిత జైపాల్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం (జూన్) నుండి ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి: ఐడి కార్డులు, స్కూల్ బ్యాగులు, పుస్తకాలు అందజేస్తానని.విద్యార్థినులకు ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్లను ఉచితంగా పంపిణీ చేస్తాఅని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో టాప్ 3లో నిలిచిన వారికి నగదు పురస్కారాలు కూడ ప్రకటించారు.సామాజిక సేవలో అగ్రగామిజయన్న ఫౌండేషన్ గతంలో 5000 మందికి కంటి పరీక్షలు, 1289 మందికి ఉచిత శస్త్రచికిత్సలు చేయించింది. మార్చి 20 నుండి తిరిగి మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వెల్లడించింది. సంపాదించే ప్రతి రూపాయిలో 50% పేద ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం 17వ వార్డు కౌన్సిలర్ కాలిక్ హుస్సేన్,పలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, వేల్పుల రత్నం, పలకల ఈశ్వర్ రెడ్డి మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

## విద్యార్థుల సమగ్ర భద్రత అంశాల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్ లోసమీక్ష..



జిల్లాలో నిర్వహించబడనున్న ఎస్.ఎస్.సి. పరీక్షలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో పరిశుభ్రత ( ఫుడ్. హైజీన్ ) , విద్యార్థుల సమగ్ర భద్రత అంశాల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో జరగనున్న ఎస్.ఎస్.సి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు , వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, నాణ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహార తయారీ, నిల్వ ,పంపిణీ ప్రక్రియల్లో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.విద్యార్థుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలలు ,హాస్టళ్లలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏసీ రెవెన్యూ, ఏసీ లోకల్ బాడీస్, సబ్ కలెక్టర్/ఆర్డీఓలు, డీఈఓ, జెడ్ఓ/డీసీఓ–టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్ ఆర్సీఓ/డీసీఓ ఏం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్ ఆర్సీఓ/డీసీఓ టి.జి.టి. డబ్ల్యూ. ఆర్. ఈ.ఐ.ఎస్.ఆర్ఎల్సీ టి.జి.ఏం.ఆర్. ఈ.ఐ.ఎస్. డీఎస్‌సీడీఓ, డీటీడీఓ, డీబీసీడీఓ, డీఎంవీవో, సూపరింటెండెంట్ హెచ్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.అలాగే మండల ప్రధాన కార్యాలయాల నుండి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, వివిధ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు (టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. )ఏం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్టి.జి.టి .డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. టి.జి.ఏం.ఆర్.ఈ.ఐ.ఎస్. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు/హెచ్‌డబ్ల్యూవోలు , కేజీబీవీ ప్రత్యేక అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.అజెండా అంశాలైన ఎస్.ఎస్.సి. పరీక్షలు, ఆహార పరిశుభ్రత, విద్యార్థుల సమగ్ర భద్రత అంశాలపై క్షేత్ర స్థాయిలో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేస్తూ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలకు వెళ్లే ఆటోరిక్షాలలో ఆరు మందికి మించి విద్యార్థులను ఎక్కించరాదని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ విషయంపై ప్రత్యేక దృష్టిసారించి కఠినంగా అమలు చేయాలని సూచించారు. పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు నిర్దేశించిన పరిమితిని తప్పనిసరిగా పాటించాలని, అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులు కూడా ఈ నియమాలను పాటించేలా డ్రైవర్లకు సూచనలు ఇవ్వాలని కోరారు. నియమాలను ఉల్లంఘించే వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులను హెచ్చరించారు.

## పెద్దనాగారం స్టేజి గ్రామ అభివృద్ధి నా లక్ష్యం సర్పంచ్ భుక్య సోనియా హరిలాల్



మహబూబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పెద్ద నాగారం స్టేజి గ్రామాన్ని అన్ని రంగాలుగా అభివృద్ధి పరచడమే నా లక్ష్యం అని గ్రామ సర్పంచ్ భుక్య సోనియా హరిలాల్ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు నాపై నమ్మకం ఉంచి నన్ను సర్పంచ్ గా గెలిపించిన ప్రతి ఒకరికి పేరుపేరునా కృతజ్ఞతలు అని అన్నారు. వారి రుణం తీర్చుకోవాలంటే గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడమే అని అన్నారు. నా నియమకానికి నా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు అని అన్నారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి ముందుగా ఏది అవసరమో దాన్ని సత్వరమే పరిష్కార మార్గంగా కృషి చేస్తానని అన్నారు. అవసరమైతే ఎమ్మెల్యే మరియు ఎంపీ వద్దకు వెళ్లి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గ్రామంలోని మౌలిక వసతులు అన్ని రంగాలుగా ఉండే విధంగా అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా ప్రజలకు వేసవి సమయంలో త్రాగునీరు, వీధిలైట్లు సిసి రోడ్లు సైడ్ కాలువలు ఇలా అన్ని రకాల పనులు చేయించేందుకు నా శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

## నూతన రాజ్యసభ సభ్యుని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా అధ్యక్షురాలు



సంగారెడ్డి జిల్లా హైదరాబాద్ లో, నూతనంగా రాజ్యసభ సభ్యులుగా నియమితులైన వేం నరేందర్ రెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా. వారికీ శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు.రాజ్యసభ సభ్యునిగా నియామకం పొందిన వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ఆకాంక్ష, అభివృద్ధి, నిమిత్తం, ప్రజా సమస్యలను పార్లమెంట్ వేదికగా బలంగా వినిపిస్తూ ప్రజలకు న్యాయం చేసే విధంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు ప్రియాంక, షబానా, పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన హుగ్గేల్లీ సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గేల్లీ గ్రామంలో ముస్లిం మైనార్టీలకు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ తోఫా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు ఈ కిట్లను స్వయంగా అందజేశారు.?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. పేద ప్రజలందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిరుపేద మైనారిటీ మహిళ కు చిరు ఆర్థిక సహాయం చేసిన బిజెపి పార్టీ మైనారిటీ రాష్ట్ర సీనియర్ నాయకులు బిజెపి సైదా



ఎన్టీఆర్ జిల్లా నందిగామ రైతు పేట లో రంజాన్ పండుగ సందర్భంగా తన ఇంటిలో జరుగుబాటు కష్టంగా భారంగా మారడం తో నిరుపేదరాలైన మైనారిటీ మహిళ బిజెపి పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు బిజెపి సైదా ను ఆశ్రయించగా తనకు తోచిన సహాయం 500 /రూ చిరు ఆర్థిక సహాయమును ఉచితంగా అందించిన బిజెపి రాష్ట్ర నాయకులు బిజెపి సైదా ఈ సందర్భంగా నిరుపేద మహిళ బిజెపి సైదా వారికి ధన్యవాదాలు తెలియజేశారు

## విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి జైపాల్ నాయక్

**- విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్స్ పంపిణీలి**



విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని, అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలుగుతారని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు బొమ్మరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ అన్నారు చౌటకూర్ మండలం బొమ్మరెడ్డి గూడెం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేసిన సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యతోనే గుర్తింపు వస్తుందని చెప్పారు పదో తరగతిలో మంచి మార్కులను సాధించాలని తెలియజేశారు ఎనిమిదో వార్డు సభ్యురాలు స్రవంతి గణపతి ఆధ్వర్యంలో భూమ్ రెడ్డి బాల్ రెడ్డి జ్ఞాపకార్థంగా ఎగ్జామ్స్ ప్యాడ్స్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజిని గోపాల్ విశ్రాంత జిల్లా అధికారులు ఖోల విట్టల్, గోవింద్ రావు, మెదక్ జిల్లా ఎక్సైజ్ డి టి ఎఫ్ సి ఐ గోపాల్,ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు నాయక్,బాల్సింగ్,మాజీ సర్పంచ్ మమత రఘునాయక్, వార్డు సభ్యులు గోపాల్,సుభాష్, మేనక గణేష్, విగేష్, బాబులాల్,శివాజీ, కిట్టు, ఉపాధ్యాయులు బాబ్య విగేష్, రవి,లు పాల్గొన్నారు

## కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని దేశ రాజధాని ఢిల్లీలో కలిసిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి..



కామారెడ్డి పట్టణ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కై (ఏ.బి.ఎస్.ఎస్.) (అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్) (ఎక్సేషన్) విస్తరణ కింద ఓరియంటల్ పాఠశాల నుండి దర్శన్ థియేటర్ ముందు వరకు అభివృద్ధి చేయాలని దాని కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర రైల్వే మంత్రి కి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

అలాగే పాత రైల్వే క్వార్టర్ లను తొలగించి కొత్తగా వివేకానంద కాలనీ వైపు నిర్మించాలని, అలాగే స్టేషన్ రోడ్ వైపు ఉన్న రైల్వే భవనాలు వివేకానంద కాలనీ వైపు నిర్మించాలని అలాగే నూతన రైల్వే భవనం మరియు ఫుట్ ఓవర్ బ్రిడ్జి కి సంబందించిన ప్లాన్స్ పూర్తి అయ్యాయని మంత్రి నుండి సానుకూల స్పందన వచ్చిందని వాటి నిర్మాణానికి ప్లాన్స్ పూర్తి చేసి ప్లాన్స్ డిపార్ట్మెంట్ నుండి కనస్ట్రక్షన్ డిపార్ట్మెంట్ పంపారని త్వరలోనే నిధులు కేటాఇస్తూ అనుమతులు కూడా ఇస్తామని కేంద్ర రైల్వే మంత్రి స్వయంగా తెలిపారు.

అంతే కాకుండా జిల్లా కేంద్రంలో మూడు చోట్ల (ఆర్.ఓ.బి.) రోడ్ ఓవర్ బ్రిడ్జి ల ఏర్పాటు చేయాలని గతంలో చేసిన వినతులకు స్థల పరిశీలన, జాయింట్ ఇన్స్పెక్షన్ సాయిల్ టెస్టింగ్ అన్ని త్వరలో పూర్తి చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభమై రెండు సంవత్సరాల లోపు పనులు పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. ఈ విషయంలో తనకు పూర్తిగా సహకారం అందిస్తున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ కి కృతజ్ఞతలు తెలిపారు ఈ విషయంలో సహకరించిన మాజీ కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల కి శాసన సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పోసానిపేట గ్రామంలో మహిళా సంఘం భవనంకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్



అందోల్ మండలం లోని పోసానిపేట గ్రామంలో ఈరోజు బుధవారం మహిళా సంఘం భవనంకు భూమి పూజ జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు విలేజ్ సెక్రటరీ గారు కాంట్రాక్టర్ హనీఫ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో యువకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యూత్ మైనార్టీ లీడర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149